సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం । 22 । ఫిబ్రవరి । 2025



చీనీ టన్ను రూ.22,200

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీ గరిష్టంగా రూ.22,200, కనిష్టంగా రూ.7 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.10

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.10 పలికింది. మార్కెట్‌కు 825 టన్నుల టమాట అమ్మకానికి వచ్చింది.

గరిష్టం/కనిష్టం
36.7°/ 13.9°

జిల్లాలో శుక్రవారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. చలితీవ్రత తగ్గుతుండగా.. రోజురోజుకూ ఎండలు పెరుగుతున్నాయి. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

సుందరం.. స్వప్నమే!

పెనుకొండ... ఈ పేరు చెబితేనే విజయనగర వైభవం కళ్లముందు సాక్షాత్కరిస్తుంది. శిల్పకళకు.. శ్రీకృష్ణదేవరాయల పాలనకు నిలువెత్తు నిదర్శనంగా ఉన్న ఈ చారిత్రక పట్టణాన్ని పాలకులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ సర్కార్ అభివృద్ధి పనులతో పర్యాటకులను ఆకర్షించగా.. సుందరీకరణ హామీలు గుప్పించి అసెంబ్లీకి వెళ్లి అమాత్యురాలిగా కొలువుదీరిన సవిత..పెనుకొండ అభివృద్ధిని పూర్తిగా విస్మరించారు. మూడు నెలల క్రితం తూతూ మంత్రంగా అక్కడక్కడా మొక్కలు నాటి చేతులు దులుపుకున్నారు. పారిశుధ్యం పడకేయగా... చాలా ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా మారాయి.





ఇది పెనుకొండ పట్టణంలో కొండపైకి వెళ్లే దారిలోని చెత్త డంప్. ఇక్కడున్న చెత్తను మరో ప్రాంతానికి తరలించే పనులను మంత్రి సవిత 3 నెలలు కిందట అట్టహాసంగా ప్రారంభించారు. ఫొటోలకు ఫోజులిచ్చి హడావుడి చేశారు. అయితే అక్కడున్న చెత్త ఇప్పటికీ అలాగే ఉంది. చెత్త తరలింపునకు తీసువచ్చిన వాహనాలు ఒక్కటీ ఇప్పుడు కనిపించడం లేదు. నిన్నటి వరకు ఉన్న యంత్రాలు కూడా వెనుదిరిగాయి. రోజుల తరబడి చెత్త ఉండిపోవడంతో వీధంతా దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు చెబుతున్నారు. పెనుకొండ సుందరీకరణ పనులు జరుగుతున్న తీరు..మంత్రి సవిత పనితీరుకు ఇదో నిదర్శనం మాత్రమే.

పెనుకొండ కోటపై నిర్లక్ష్యపు జెండా

- పట్టణ అభివృద్ధిపై దృష్టి సారించని మంత్రి సవిత
- తూతూ మంత్రంగా డివైడర్ల మధ్య మొక్కలు
- పడకేసిన పారిశుధ్యం.. పట్టణమంతా దుర్గంధం
- రోడ్లపై లైట్లు కూడా ఏర్పాటు చేయని వైనం

పెనుకొండ: పట్టణ సుందరీకరణ పనులు అటకెక్కాయి. పెనుకొండ రూపురేఖలు మార్చేస్తామని హామీలు గుప్పించిన స్థానిక ఎమ్మెల్యే, మంత్రి సవిత మాటలు నీటి మీద రాతలుగానే మారాయి.



పెనుకొండలో రైల్వేస్టేషన్ రోడ్డు దుస్థితి

గతమెంతో ఘనం..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పెనుకొండ అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చారు. పెనుకొండను నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ చేసి రోడ్ల అభివృద్ధికి రూ. 40 కోట్లు మంజూరు చేశారు. 44వ జాతీయ రహదారి నుంచి మార్కెట్ యార్డ్ వరకు, మడకశిర రోడ్డు నుంచి షీఫారం వరకూ డబుల్ లేన్ రోడ్డుకు సహకారం అందించారు. మెడికల్ కళాశాలతో పాటు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి రూ. 475 కోట్ల మేర మంజూరు చేశారు.

అధ్వానంగా రోడ్లు..

ప్రస్తుతం పట్టణ పరిధిలో రోడ్లు అధ్వానంగా మారాయి. పట్టణంలోని కోనాపురం రహదారి చాలా అధ్వానంగా ఉంది. రోడ్డు నిర్మాణానికి ఇటీవల మంత్రి సవిత భూమి పూజ చేసినా... పనులు మాత్రం ప్రారంభం కాలేదు. రైల్వేస్టేషన్ రోడ్డు కూడా ప్రయాణానికి అనుకూలంగా లేకపోవడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ పరిధిలోని దాదాపు నాలుగు కి.మీ మేర ఉన్న రహదారిపై బటర్ ఫ్లై లైట్లను ఏర్పాటు చేస్తామని చెప్పినా... ఇంత వరకూ ఆ దిశగా పనులు మాత్రం జరగలేదు. దీంతో ప్రధాన రహదారి మీదనే అంధకారం నెలకొంది.



ప్రభుత్వ ఆస్పత్రి వద్ద దుర్వాసన వెదజల్లుతున్న డ్రైనేజీ

వీధుల్లో దుర్వాసన..

పట్టణంలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వీధులన్నీ దుర్వాసన వెదజల్లుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రి ముందున్న డ్రైనేజీ నుంచి వస్తున్న దుర్వాసన తట్టుకోలేక రోగులు అల్లాడిపోతున్నారు. పట్టణంలోని పలు వీధుల్లో మురుగు బయటకు వస్తుండటంతో దోమలు వ్యాప్తి అధికంగా ఉంది.

డివైడర్ల మధ్య మట్టి మాయం..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో డివైడర్ల మధ్య మట్టి నింపిన దృశ్యం



ప్రస్తుతం డివైడర్ల మధ్య ఉన్న మట్టిని తొలగించిన దృశ్యం

నగర సుందరీకరణ పనుల్లో భాగంగా అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అధికారులు డివైడర్‌ల మధ్య మట్టిని నింపి మొక్కలు నాటడానికి కార్యాచరణ ప్రారంభించారు. మార్కెట్‌యార్డ్ నుంచి 44వ జాతీయ రహదారి వరకూ డివైడర్ల మధ్యలో మట్టిని నింపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన అనంతరం కొందరు నాయకులు ఉన్న మట్టిని బయటకు తరలించి సొమ్ము చేసుకున్నారన్న విమర్శలున్నాయి. కొత్తగా ఎర్ర మట్టిని నింపి మొక్కలు నాటుతారన్న ప్రచారం జరిగినా.. ఇప్పటి వరకూ కార్యరూపం దాల్చడం లేదు. దీంతో సుందరీకరణ పనులపై నీలినీడలు కమ్ముకున్నాయి.

మాట నిలుపుకోవాలి



పెనుకొండను అన్ని విధాలా అభివృద్ధి చేస్తానన్న మంత్రి సవిత మాట నిలుపుకోవాలి. ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పట్టణ సుందరీకరణకు కృషి చేస్తానని ఎన్నో సార్లు చెప్పినా... కార్యరూపం దాల్చలేదు. ప్రధానంగా విద్యుత్ లైట్లు లేక మెయిన్ రోడ్లలోనే అంధకారం నెలకొంది. ప్రజలు, వృద్ధులు, విద్యార్థులు, మహిళలు ఎంతో ఇబ్బంది పడుతున్నారు.

– ఫరీద్, దర్గాపేట, పెనుకొండ

సుందరీకరణకు సహకరిస్తాం

పట్టణ సుందరీకరణ పనులకు మా సహకారం తప్పక ఉంటుంది. కానీ మంత్రి సవిత కేవలం మాటలు చెప్పి చేతులు దులుపుకుంటున్నారు. ఎంతో ప్రాశస్త్యం ఉన్న పట్టణాభివృద్ధిపై ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు.

– రఘునాథరెడ్డి, కౌన్సిలర్, పెనుకొండ

సహకారం తీసుకుంటాం



మున్సిపాలిటీలో నిధుల కొరత ఉంది. అందువల్ల పట్టణ సుందరీకరణ పనులకు దాతల సహకారం తీసుకుంటాం. ప్రభుత్వం నుంచీ నిధులు రాబట్టి స్థానిక ఎన్నికలు నాటికి సుందరీకరణ పనులు పూర్తయ్యేలా చూస్తాం

– సవిత, బీసీ సంక్షేమశాఖా మంత్రి

న్యూస్‌రీల్

క్వింటా ఎండుమిర్చి రూ.15 వేలు



మార్కెట్‌కు వచ్చిన ఎండు మిర్చి

హిందూపురం అర్బన్: ఎండుమిర్చి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం హిందూపురం వ్యవసాయ మార్కెట్‌కు 60.40 క్వింటాళ్లు రాగా, అధికారులు ఈ–నామ్ పద్ధతిలో వేలం పాట నిర్వహించారు. ఇందులో మొదటి రకం క్వింటా గరిష్ఠంగా రూ.15 వేలు, కనిష్ఠంగా రూ.8 వేలు, సగటున రూ.13 వేల ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయని మార్కెట్ కార్యదర్శి జి.చంద్రమౌళి తెలిపారు. సీజన్ ముగుస్తుండటంతో పాటు ధరలు ఆశించినంత లేకపోవడంతో రైతులు ఎండుమిర్చిని కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉంచారని, దీంతో మార్కెట్‌కు వచ్చే సరుకు తగ్గిందని ఆయన వెల్లడించారు.

రిజిస్ట్రేషన్ ఉద్యోగుల బదిలీలు రద్దు

అనంతపురం టౌన్: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో పలువురు అధికారులు, ఉద్యోగుల బదిలీలు రద్దయ్యాయి. ఉమ్మడి జిల్లాలో అనంతపురం రామ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ యూనస్, రాయదుర్గం సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు, పెనుకొండ సబ్ రిజిస్ట్రారు వెంకటనాయుడు, సీనియర్ అసిస్టెంట్లు జయదీప్, శ్రీనివాసరెడ్డి తదితరులను డిప్యుటేషన్‌పై విజయవాడలోని ఐజీ కార్యాలయానికి రెండు రోజుల క్రితం బదిలీ చేశారు. అయితే బదిలీ ఉత్తర్వుల్లో 45 సంవత్సరాలలోపు వయస్సు నిబంధనతో పాటు డైరెక్టు రిక్రూట్ అయి ఉండాలనే నిబంధనలు ఉండడంతో వారందరూ బదిలీకి అనర్హులుగా గుర్తించి ఐజీ కార్యాలయ అధికారులు జాయినింగ్ ఆర్డర్లు ఇవ్వకుండా వెనక్కు పంపారు. వీరందరిని తిరిగి వారి స్థానాలకు కేటాయించనున్నట్లు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ విజయలక్ష్మి తెలిపారు.

కలెక్టరేట్‌లో 'టమాట' కంట్రోల్ రూం



ప్రశాంతి నిలయం: జిల్లాలో టమాట పండించే రైతులకు మార్కెటింగ్‌కు సంబంధించి సమాచారం అందించేందుకు కలెక్టరేట్‌లో 08555289431 నంబరుతో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా రైతులు 1,013 హెక్టార్లలో టమాట సాగు చేశారని, పంట విక్రయానికి సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు కంట్రోల్ రూం ద్వారా అందిస్తామని పేర్కొన్నారు. రైతులు 9182361127 (మార్కెటింగ్ శాఖ అధికారి), 7995086791 (జిల్లా ఉద్యాన అధికారి) నంబర్లకు కూడా ఫోన్ చేసి సమాచారం పొందవచ్చన్నారు.

బుగ్గలో శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం



పార్వతీ సమేత బుగ్గరామలింగేశ్వరుడికి అగ్ని నివేదన

తాడిపత్రి రూరల్: ప్రసిద్ధ శైవక్షేత్రం బుగ్గరామలింగేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం సాయంత్రం ధ్వజారోహణంతో మహా శివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. నందీశ్వరుని చిత్ర పటానికి అర్చకులు ప్రత్యేక పూజలు చేసి.. ఎగురవేశారు. అంతకు మునుపు బుగ్గరామలింగేశ్వర స్వామి మూలవిరాట్‌కు అగ్ని నివేదన చేశారు. అక్కడి నుంచి అగ్నిని ఊరేగింపుగా హోమశాలకు తీసుకువచ్చారు. అక్కడ సంప్రదాయ పద్ధతిలో అగ్గి రాజింపచేసి ముట్టించారు. ఉదయం గణపతి పూజ, అగ్ని మదనం, వాస్తు బలి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని పార్వతీ బుగ్గ రామలింగేశ్వర స్వామిని వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

సమష్టి కృషితోనే నేర నియంత్రణ





నేరసమీక్ష సమావేశానికి హాజరైన పోలీస్ అధికారులు, మాట్లాడుతున్న ఎస్పీ రత్న

- లాంగ్ పెండింగ్ కేసులపై దృష్టి సారించండి
- నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: జిల్లాలో నేర నియంత్రణకు పోలీసులంతా సమష్టిగా పనిచేయాలని ఎస్పీ రత్న పిలుపునిచ్చారు. చాలా రోజులుగా పెండింగ్‌లో ఉన్న కేసులపై దృష్టి సారించాలని, ఆయా కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. శుక్రవారం ఆమె జిల్లా పోలీస్ కార్యాలయంలో డీఎస్పీలు, సీఐలతో నెలవారీ నేర సమీక్ష చేశారు. గ్రేవ్, నాన్‌గ్రేవ్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, పోక్సో, హత్యలు, చోరీ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నేర నియంత్రణలో ప్రతిభ కనబరచిన 67 మంది పోలీస్ అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ఏదైనా కేసు నమోదు చేసిన 60 రోజుల్లోపు కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయాలన్నారు. 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో అందే అర్జీలపై విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలన్నారు. మహిళా భద్రతపై దృష్టి సారించాలని, ఉమెన్ హెల్ప్ డెస్క్‌లో వచ్చిన ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రభుత్వ హాస్టళ్లు, పాఠశాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా చూడాలన్నారు. జిల్లాలోని శైవ క్షేత్రాల్లో శివరాత్రి వేడుకలకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. డ్రోన్ కెమెరాలు ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలన్నారు. రోజూ విజుబుల్ పోలీసింగ్ నిర్వహించి అసాంఘిక కార్యక్రమాలను అరికట్టాలన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే వ్యక్తులను గుర్తించి బైండోవర్ చేయాలన్నారు. రాత్రి వేళల్లో గస్తీలు ముమ్మరం చేసి పాత నేరస్తుల కదలికలపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో డీఎస్పీలు విజయకుమార్, మహేష్, హేమంత్‌కుమార్, ఆదినారాయణ, లీగల్ అడ్వయిజర్ సాయినాథ్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఎస్‌ఐ ప్రదీప్ కుమార్, డీసీఆర్‌బీ సీఐ శ్రీనివాసులు, ఐటీ కోర్ ఇన్‌చార్జ్ సుదర్శన్ రెడ్డితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సమక్షంలోనే రీసర్వే చేపట్టాలి

- కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: భూ యజమానితో పాటు చుట్టుపక్కల పొలాల రైతుల సమక్షంలోనే రీసర్వే చేపట్టాలని కలెక్టర్ టీఎస్ చేతన్ రెవెన్యూ, సర్వే అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో రీ సర్వేపై సమీక్షించారు. రీ సర్వే ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. వెబ్ ల్యాండ్ రికార్డుల ప్రకారం రీ సర్వే నిర్వహించాలన్నారు. రోజూ ఉదయం 6 గంటల నుంచి రీ సర్వే ప్రక్రియ ఎలా జరుగుతుందో సర్వే ఏడీఈలు తనిఖీ చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, ఆర్డీఓలు సువర్ణ, ఆనంద్‌కుమార్, శర్మ, మహేష్, ల్యాండ్ సర్వే ఏడీఈ విజయశాంతి బాయి, పలువురు సర్వేయర్లు పాల్గొన్నారు.

పీపుల్ సర్వేతో పేదల జీవితాల్లో వెలుగులు

పీపుల్ సర్వే–4తో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన పేదల జీవితాల్లో వెలుగులు నిండుతాయని కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. ఈ సర్వే ద్వారా జీవన ప్రమాణాల్లో అట్టడుగు స్థాయిలో ఉన్న 20 శాతం మంది నిరుపేదలను గుర్తించడంతో పాటు వారిని ఆర్థికంగా నిలబెట్టేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందన్నారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్ నుంచి మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, నియోజకవర్గ, మండలాల ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పీ–4 సర్వేపై దిశానిర్దేశం చేశారు. ఈనెల 21 నుంచి 28వ తేదీ వరకూ సర్వే చేపట్టి వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారిని గుర్తించడంలో భాగంగా పక్కా గృహం, విద్యుత్ సౌకర్యం, ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్, స్థిర, చర ఆస్తులు లేని వారిని గుర్తించి అర్హులుగా చేర్చాలన్నారు. అంతకు ముందు కలెక్టర్ చేతన్ పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 19 వార్డు ప్రశాంతి గ్రామంలో జరుగుతున్న పీ–4 సర్వేను పరిశీలించారు. లీలావతి, రూప, ఓబులేసు ఇళ్లలోని వివరాలను అడిగి తెలుసుకుని సర్వేలో నమోదు చేశారు. కలెక్టర్ వెంట పలు శాఖల జిల్లా అధికారులు ఉన్నారు.



19వ వార్డులో పీపుల్ సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ఇంటర్ పరీక్షలను సజావుగా నిర్వహించాలి..

జిల్లాలో ఇంటర్ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ఇంటర్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు సంబంధించి సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని 13,083 మంది మొదటి సంవత్సరం, 10,904 మంది విద్యార్థులు ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరుకానుండగా, వీరి కోసం 42 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మార్చి 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, ఏర్పాట్లలో లోపాలు లేకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో జేసీ అభిషేక్ కుమార్, డీఆర్‌ఓ విజయ సారథి, ఆర్డీఓలు సువర్ణ, శర్మ, మహేష్, ఆనంద్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

తూకాల్లో తేడాలుంటే చర్యలు



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

- రేషన్ దుకాణాల ద్వారా సరుకులు పక్కాగా అందాలి
- కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశం

ప్రశాంతి నిలయం: ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా అందించే బియ్యం, చక్కెర, కందిపప్పు తదితర నిత్యావసరాల తూకాల్లో వ్యత్యాసాలుంటే సంబంధిత డీలర్‌తో పాటు అధికారులపైనా చర్యలు తప్పవని కలెక్టర్ టీఎస్ చేతన్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాలులో జిల్లా ప్రజా పంపిణీ వ్యవస్థపై సమీక్షించారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా అరికట్టాలని పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్లను ఆదేశించారు. ఎక్కడ బియ్యం పట్టుబడినా కేసులు నమోదు చేయాలన్నారు. ప్రతి నెలా రేషన్ దుకాణాలను పరిశీలించి పనితీరుపై నివేదిక ఇవ్వాలన్నారు. ఎండీయూ వాహనాలను, గ్యాస్ ఏజెన్సీలను తనిఖీ చేయడంతో పాటు వాటి పని తీరు గురించి ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించాలన్నారు. ఎక్కడైనా లోపాలు బయటపడితే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో జిల్లా వెనుకబడి ఉందని, పనితీరు మెరుగుపర్చుకోవాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆర్డీఓలు సువర్ణ, శర్మ, మహేష్, ఆనంద్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వంశీకృష్ణారెడ్డి, మేనేజర్ అశ్వర్థ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అతిరుద్రం.. ఆనంద పరవశం

- గానామృతంతో మైమరపింపజేసిన రమ్యా బెహర



అతిరుద్ర యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

ప్రశాంతి నిలయం: అతిరుద్ర మహాయజ్ఞంతో భక్తకోటి ఆధ్యాత్మిక పరిమళాలతో ఆనందపరవశం చెందుతోంది. వేదపండితుల మంత్రోచ్చారణలు..సంగీత కళాకారుల గానామృతంతో ప్రశాంతి నిలయం పరవశించిపోతోంది. విశ్వశాంతిని కాంక్షిస్తూ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సాయికుల్వంత్ సభా మందిరంలో నిర్వహిస్తోన్న అతిరుద్ర మహాయజ్ఞంలో ఎనిమిదోరోజు శుక్రవారమూ వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం ప్రముఖ తెలుగు సినీ నేపథ్య గాయని రమ్యా బెహర బృందం సత్యసాయిని కీర్తిస్తూ చేసిన సంగీత కచేరీ భక్తులను మైమరపింపజేసింది. చెన్నైలోని చర్చిపార్క్ స్కూల్‌కు చెందిన విశ్రాంత సంస్కృత ఉపాధ్యాయురాలు డాక్టర్ అన్నపూర్ణ అతిరుద్ర మహాయజ్ఞ వైభవాన్ని వివరించారు. అనంతరం భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



యజ్ఞం విశిష్టతను వివరిస్తున్న డాక్టర్ అన్నపూర్ణ



అతిరుద్ర మహాయజ్ఞ క్రతువులను నిర్వహిస్తున్న వేదపండితులు



కచేరీ నిర్వహిస్తున్న రమ్యా బెహర

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్య


సయ్యద్ బాషా

చెన్నేకొత్తపల్లి: మండలంలోని దామాజిపల్లికి చెందిన సయ్యద్ బాషా (40) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... పాడి పోషణతో పాటు కూలి పనులతో జీవనం సాగిస్తున్న సయ్యద్ బాషాకు భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. దీంతో శుక్రవారం ఉదయం కుటుంబసభ్యులు మందలించడంతో మనస్తాపం చెందిన ఆయన ఇంటి సమీపంలోనే ఉన్న పశువుల కొట్టంలోకి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా ఈ విషయాన్ని గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే సీకే పల్లిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి దుర్మరణం

పరిగి: ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడిన ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... రొద్దం మండలం బూదిపల్లికి చెందిన ఉప్పర రమేష్ (40) ఎలక్ట్రీషియన్‌గా జీవనం సాగిస్తున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గురువారం తన బావమరిదితో కలిసి ద్విచక్రవాహనంపై సోమందేపల్లి మండలం కేతగానిచెరువుకు వెళ్లాడు. అదే రోజు రాత్రి పరిగి మండలం గొల్లపల్లి మీదుగా తన సొంతూరుకు బయలుదేరిన రమేష్... బీచిగానిపల్లి సమీపంలో వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలోకి దూసుకెళ్లాడు. ప్రమాదంలో కిందపడి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. శుక్రవారం ఉదయం అటుగా వెళ్లిన స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. లభ్యమైన ఆధారాలను బట్టి మృతుడిని రమేష్‌గా నిర్ధారించుకుని సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. ఘటనపై మృతుడి భార్య సౌభాగ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడికి రిమాండ్

రొళ్ల: పోక్సో కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మడకశిర రూరల్ సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. వివరాలు... రొళ్ల మండలంలోని ఓ గ్రామానికి చెందిన 17 ఏళ్ల వయస్సున్న బాలిక ఈ ఏడాది జనవరి 2వ తేది నుంచి కనిపించడం లేదని తల్లిదండ్రులు అదే నెల 4వ తేదిన రొళ్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొద్ది రోజుల తర్వాత ఇంటికి చేరుకున్న బాలిక... తనను ఆర్.వడ్రహట్టికి చెందిన ధనరాజ్ కుమారుడు కిరణ్ బలవంతంగా పిలుచుకెళ్లి కర్ణాటకలోని శిడ్లఘట్ట తాలూకా దిబ్బూరహళ్లిలో ఓ ఇంట్లో బంధించి అత్యాచారం చేసినట్లుగా పోలీసుల ఎదుట తన వాగ్మూలాన్ని ఇచ్చింది. అక్కడి నుంచి అతి కష్టం మీద తప్పించుకుని వచ్చినట్లు పేర్కొంది. దీంతో కిరణ్‌పై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం సాయంత్రం ఆర్.వడ్రహట్టిలో అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

అతిగా మద్యం సేవించి వ్యక్తి మృతి

మడిగుబ్బ: అతిగా మద్యం సేవించి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. శుక్రవారం రాత్రి ముదిగుబ్బలోని నాయీ బ్రాహ్మణ కాలనీలో ఈ ఘటన చోటు చేసుకుంది. అంబేడ్కర్ సర్కిల్‌లో చెత్త కాగితాలు ఏరుకుంటూ ఉండడం చూసినట్లుగా స్థానికులు తెలిపారు. మద్యం అతిగా సేవించి మృతి చెంది ఉంటాడనే అనుమానాన్ని పోలీసులు వ్యక్తం చేశారు. ఘటనపై విచారణ కొనసాగుతోందని పేర్కొన్నారు.

అభిరుచులు ఒక్కటే

అనంతపురం నగరానికి చెందిన మల్లికార్జునరెడ్డి, రాధ ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. వీరికి ఓ బాబు తర్వాత 2012లో కవలలు జన్మించారు. సాయి సహస్ర, సాయి సమన్వి అని పేర్లు పెట్టారు. పెరుగుతున్న కొద్దీ కాసింత పోలికలు వేరైనా అభిరుచులు, ఇష్టాలు మాత్రం ఒక్కటేనని తల్లిదండ్రులు అంటున్నారు.



సందర్భం
నేడు ప్రపంచ కవలల దినోత్సవం

అచ్చం.. అలాగే!

- అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్న కవలలు
- ఒకే పోలికతో తికమక పెట్టిన సందర్భాలు అనేకం

అనంతపురం కల్చరల్/ఎడ్యుకేషన్/గుత్తి రూరల్ : ఒకే పోలిక.. ఒకే డ్రెస్. అచ్చం ఒకరిని చూస్తే మరొకరిని చూసినట్లే! జిరాక్స్ టూ జిరాక్స్... ఇలా చెప్పుకుంటూ పోతే కవలల గురించి ఎన్నో అంశాల్ని పోల్చి చెప్పినా తక్కువే అవుతుంది. తల్లిగర్భంలో ఒకేసారి, ఒకే రూపంతో మొదలై.. క్షణాల వ్యవధిలో బయటి ప్రపంచానికి పరిచయమై.. ఒకే ముఖకవళికలతో అందరినీ అమితంగా ఆకట్టుకోవడం కవలల ప్రత్యేకత. ముద్దులొలికే పసికందులను చూడగానే వారి పేర్లను కూడా దరిదాపు ఒకేలా పెట్టేయడం పరిపాటిగా మారింది. రామయ్య.. లక్ష్మయ్య, రమేష్.. నరేష్, జలజ.. శైలజ... లాంటి పేర్లతోనూ తికమక పట్టించేస్తుంటారు. నేడు ప్రవపంచ కవలల దినోత్సవాన్ని పురస్కరించుకుని 'సాక్షి' ప్రత్యేక కథనం.

సైన్స్ ఏమి చెబుతోందంటే

సృష్టి లోని ఎన్నో వింతలు, అద్భుతాల్లో కవలల జననం కూడా ఒకటిగా ఉంటోంది. బాగా తెలిసిన వారు సైతం కవలలను ఎవరెవరో పోల్చుకోవడం కాస్త ఇబ్బందిగానే ఉంటుంది. ఫలదీకరణ సమయంలో వచ్చే మార్పుల కారణంగా కవలల జననం సంభవిస్తుందని వైద్య నిపుణులు అంటున్నారు. ప్రత్యుత్పత్తి ప్రక్రియలో అండం ఏర్పడిన తర్వాత శుక్రకణం రెండుగా విడిపోయి జన్మించిన కవలలను మోనోజైగోటిక్ లేదా యూని ఓవిలార్ ట్విన్స్ అంటారు. వీరిలో ఇద్దరూ ఆడ లేదా, మగ అయి ఉంటారు. వీరికి చాలా దగ్గర పోలికలుంటాయి. రెండు శుక్ర కణాలు ఏర్పడి జన్మించే కవలలను 'డై జైగోటిక్ లేదా బైనోవిలార్ ట్విన్స్ అంటారు. వీరిలో ఒకరు ఆడ, మరొకరు మగ అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

కవలల దినోత్సవ ఆవిర్భావమిలా.

ప్రథమంగా కవలల దినోత్సవాన్ని పోలెండు దేశస్థులు 1976లో నిర్వహించారు. మోజెస్, విల్‌కాక్స్ అనే కవల సోదరులు తాము నివసిస్తున్న ఊరికి 'ట్విన్స్ బర్గ్' అని పేరుపెట్టుకున్నారు. కవలలనే పెండ్లాడి, మళ్లీ కవలలకే జన్మనిచ్చారు. దురదృష్టమైన విషయమేమంటే ఒకే రకమైన వ్యాధి సోకి వారిద్దరూ ఒకే రోజు మరణించారు. వీరి గుర్తుగా ప్రతి ఫిబ్రవరి 22న ప్రపంచ కవలల దినం జరపడం పరిపాటిగా మారింది.

మంచి స్నేహితుల్లా



అనంతపురం నగరానికి చెందిన కవలలు సందీప్, సంతోష్ చిన్నప్పటి నుంచి మంచి స్నేహితుల్లా పెరిగారు. చదువుతో పాటు ఆటల్లోనూ పోటీపడేవారు. 2001లో జన్మించారు ప్రస్తుతం సందీప్ ఐఐటీ మద్రాసులో ప్రాజెక్టు అసోసియేట్‌గా, సంతోష్ హైదరాబాదులోని ఐసీఐసీఐ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నారు. తల్లిదండ్రులు చిదానందమూర్తి, నిర్మల మాట్లాడుతూ దూరంగా ఉండడం ఇష్టం లేకపోయినా అవకాశాల దృష్ట్యా వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్నారని ఒకే ఆలోచనలతో ఉండడం వీరి ప్రత్యేకతగా చెప్పుకొచ్చారు.

ఇద్దరూ ఇద్దరే



తాడిపత్రి పట్టణానికి చెందిన షేక్.నాజియా, షేక్.బాబా ఫకృద్దీన్ దంపతుల పిల్లలు మన్నత్ అఫ్రా, మన్నత్ అష్మరాను చూస్తే ఎవరు ఎవరో గుర్తు పట్టడం చాలా కష్టం. ఇద్దరూ మొంటి ఘటాలే. డ్రస్సులు, ఆభరణాలు ఏది కొన్నా ఇద్దరికీ ఒకేలా ఉండాలి. భోజనం, అల్పాహారం కూడా సేమ్ టు సేమ్ ఉండాలి. లేకపోతే గొడవ చేసేస్తారు. ఇద్దరూ ఒకేసారి అస్వస్థతకు గురవుతుంటారు. ఏ పని చేసినా ఇద్దరు ఒకేలా చేస్తారు.

ఇద్దరూ పోటాపోటీ



కదిరి నియోజకవర్గం గాండ్లపెంట మండలం తాళ్లకాల్వకు చెందిన ఉపాధ్యాయుడు గంగాధర్ రెడ్డి, రాణి దంపతుల కవల పిల్లలు చిద్రపు శశిధర్ రెడ్డి, చిద్రపు మహిధర్ రెడ్డి. వీరు చిన్నప్పటి నుంచి చదువులో తొలి రెండు స్థానాల్లో నిలిచేవారు. ఇందు కోసం పోటాపోటీగా చదువుకునేవారు. ప్రస్తుతం ఇద్దరూ బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నారు. ఎన్ఐటీ - వరంగల్‌లో శశిధర్‌రెడ్డి, ఎన్ఐటీ - సిల్చార్‌లో మహిధర్‌రెడ్డి చదువుతున్నాడు.

ఆరోగ్యం ఇద్దరికీ ఒకేలా..



అనంతపురంలోని కృపానందనగర్‌లో నివాసముంటున్న జిలాన్ బాషా, ఫక్రున్నీసా దంపతుల పిల్లలు బుష్రా, జిక్రా ఇష్టాయిష్టాలు వేర్వేరుగా ఉన్నాయి. బుష్రా ఆటలు, చదువులో రాణిస్తోంది. జిక్రాకు దైవప్రార్థనలపై ఆసక్తి ఎక్కువ. ఏ డ్రస్సు కొన్నా ఒకే డిజైన్ లేకపోతే భలే గొడవ చేసేస్తారని, ఒకరికి ఆరోగ్యం బాగాలేకపోతే మరొకరు ఇబ్బంది పడడం ప్రతిసారీ జరుగుతోందని తల్లిదండ్రులు అంటున్నారు.

బయటవాళ్లు పోల్చుకోలేరు



అనంతపురం నగరానికి చెందిన చెన్నారెడ్డి, హేమలత దంపతుల పిల్లలు రాహిత్య, రిత్వికను రోజూ చూస్తున్న వారు తప్ప ఇతరులు పోల్చుకోవడం చాలా కష్టం. చిన్నప్పుడు స్కూల్‌లోనూ అలాగే జరిగేదని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక


ఎంపికైన దొమ్మరహట్టి గురుకుల పాఠశాల విద్యార్థులు

రొళ్ల: మండల పరిధిలోని దొమ్మరహట్టి గ్రామ సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో 8, 9వ తరగతి చదువుతున్న 11 మంది విద్యార్థులు జాతీయ స్థాయి కబడ్డీ, క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాల ప్రిన్సిపాల్ మైలారప్ప, పీఈటీలు వెంకటనారాయణ, చంద్రశేఖర్ తెలిపారు. రెండు రోజుల క్రితం అనంతపురంలోని పీటీసీ క్రీడా మైదానం వేదికగా నిర్వహించిన జిల్లా స్థాయి నిర్వహించిన పోటీల్లో 27 మంది విద్యార్థులు పాల్గొనగా కబడ్డీ పోటీలో ప్రశాంత్‌కుమార్‌నాయక్, జానీ, ఓంకార్, హర్ష, క్రికెట్‌లో మనోహర్, క్రాంతి, వరుణ్, హర్షవర్ధన్, శేఖర్, హరీశ్, పరుగు పందెంలో ప్రణయ్‌దీక్షిత్ సత్తా చాటి మార్చి 25, 26, 27తేదీల్లో ఒడిశాలో జరిగే జాతీయ జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

ఒంటి పూట బడులు పెట్టాలి : వైఎస్సార్‌టీఏ

పుట్టపర్తి: ఈ ఏడాది వేసవికి ముందే ఎండలు అధికంగా ఉన్నాయని, ఈ నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఒంటి పూట బడులను నడిపేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని జిల్లా వైఎస్సార్‌టీఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ రమణారెడ్డి, ఇంద్ర ప్రసాద్ శుక్రవారం డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. గతంలో ఎన్నడు లేని విధంగా ఈ ఏడాది వేసవి రాక ముందే ఎండలు మండిపోతున్నాయని పేర్కొన్నారు. దీంతో ఒంటి పూట బడులు నిర్వహిస్తే విద్యార్థులకు ఎంతో వెసులుబాటుగా ఉంటుందన్నారు.

మార్చి 24, 25న బ్యాంకుల సమ్మె

- జయప్రదం చేయాలని నాయకుల పిలుపు


ఎస్‌బీఐ ఎదుట ధర్నా చేస్తున్న బ్యాంకు ఉద్యోగ సంఘాల నాయకులు

అనంతపురం అగ్రికల్చర్: యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) పిలుపు మేరకు మార్చి 24, 25న దేశవ్యాప్తంగా తలపెట్టిన బ్యాంకుల సమ్మెను విజయవంతం చేయాలని బ్యాంకు ఉద్యోగ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం అనంతపురంలోని ఎస్‌బీఐ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడారు. బ్యాంకుల్లో అన్ని విభాగాల్లో ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి పర్మనెంట్ నియామకాలు చేపట్టాలన్నారు. బ్యాంకుల ప్రైవేటీకరణ ఆపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారానికి ఐదు రోజుల పనిదినాలను అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేస్తున్న గ్రాట్యుటీ యాక్ట్‌ను బ్యాంకు ఉద్యోగులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యల పరిష్కారానికి దశల వారీగా చేపట్టనున్న ఆందోళనలో భాగంగా మార్చి 24, 25న సమ్మెలోకి వెళుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ ఉద్యోగ సంఘాల నాయకులు కె.ఖాదర్‌బాషా, చంద్రమోహన్, నరేంద్ర, రఘురామయాదవ్, చంద్రశేఖర్, రమేష్, మహేంద్ర, జయకృష్ణ, అనూష, నీలిమ, భారతి, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం కార్డు తస్కరించి.. రూ. 51 వేలు స్వాహా

- కేసు నమోదుకు సహకరించని గుత్తి పోలీసులు
- గుంతకల్లు మండల వాసి కాబట్టి అక్కడికే వెళ్లి ఫిర్యాదు చేయాలంటూ ఉచిత సలహా

గుత్తి: వృద్ధుడిని ఏమార్చి ఆయన ఏటీఎం కార్డు ద్వారా రూ.51 వేలను అపహరించిన ఘటన గుత్తిలో వెలుగుచూసింది. వివరాలు.. గుంతకల్లు మండలం గొల్లలదొడ్డికి చెందిన వృద్ధుడు తలారి రామాంజనేయులు శుక్రవారం రాత్రి రూ.5 వేలు డ్రా చేయడానికి గుత్తి లోని ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద ఉన్న ఏటీఎం కేంద్రానికి చేరుకున్నాడు. అయితే నగదు డ్రా చేసే విధానం తెలియక నిలబడి ఉండడం గమనించిన ఓ ఆగంతకుడు నగదు డ్రా చేసిస్తానంటూ ఏటీఎం కార్డు తీసుకుని ప్రయత్నించాడు. అయితే డబ్బు డ్రా కావడం లేదంటూ అప్పటికే తన వద్ద సిద్ధంగా ఉంచుకున్న మరో ఏటీఎం కార్డును వృద్ధుడికి అందజేసి వెళ్లిపోయాడు. కాసేపటి తర్వాత తన బ్యాంక్ ఖాతా నుంచి రూ. 51 వేలు డ్రా అయినట్లు వృద్ధుడి సెల్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో తాను మోసపోయినట్లుగా నిర్ధారించుకున్న వృద్ధుడు పోలీసులను ఆశ్రయిస్తే ఫిర్యాదు సైతం తీసుకోకుండా వెనక్కు పంపారు. 'నీది గుంతకల్లు మండలం కావడంతో అక్కడికెళ్లి కంప్లైంట్ ఇవ్వాలని' పోలీసులు చెబుతున్నారంటూ విలేకరుల ఎదుట వృద్ధుడు వాపోయాడు.

పెట్రోల్ బంకుల్లో మోసం.. తనిఖీల్లో బట్టబయలు


పెట్రోల్ బంక్‌ను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ డీఎస్పీ

అనంతపురం: నగర శివారున సోములదొడ్డి వద్ద ఉన్న విజయలక్ష్మి (ఇండియన్) పెట్రోల్ బంక్‌లో చిప్ అమర్చి మీటర్ రీడింగ్‌ను ట్యాంపరింగ్ చేస్తున్నట్లుగా విజిలెన్స్ అధికారులు నిర్ధారించారు. శుక్రవారం చేపట్టిన తనిఖీల్లో చిప్‌ను విజిలెన్స్ అధికారులు పసిగట్టారు. ఏడాదిలో 28 లక్షల లీటర్ల డీజిల్ అమ్మకం జరగగా, ఇందులో 2.80 లక్షల లీటర్ల సొమ్మును స్వాహా చేసినట్లుగా గుర్తించారు. ఇలాంటి చిప్ తరహాలోనే జిల్లాలో మరిన్ని పెట్రోల్ బంకుల్లో మోసాలు జరుగుతున్నాయని, అన్నింటిపై విస్తృత తనిఖీలు చేపట్టి అక్రమాలను అడ్డుకుంటామని విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం తెలిపారు.

పోలీస్ సిబ్బందికి ప్రశంసాపత్రాల అందజేత


ఎస్పీ రత్న చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న ఎస్‌ఐ సోమశేఖర్


ఏఎస్‌ఐ విజయ్‌కుమార్


కానిస్టేబుల్ గోపాల్

బత్తలపల్లి: అంకితభావంతో విధులు నిర్వర్తించిన సిబ్బందిని అభినందిస్తూ ఎస్పీ రత్న ప్రశంసాపత్రాలను అందజేశారు. శుక్రవారం పుట్టపర్తిలోని డీపీఓలో జిల్లా క్రైమ్ రివ్యూ మీటింగ్ జరిగింది. బత్తలపల్లి ఎస్‌ఐ సోమశేఖర్, ఏఎస్‌ఐ విజయ్‌కుమార్, కానిస్టేబుల్ గోపాల్‌ను అభినందిస్తూ ప్రశంసాపత్రాలను ఎస్పీ అందజేశారు. గత నెల 31న రాత్రి 11 గంటల సమయంలో మండలంలోని సూర్యచంద్రాపురం గ్రామానికి చెందిన సాకే కుళ్లాయప్ప, గంగాభవానీ దంపతులు గొడవపడ్డారు. అనంతరం తన ముగ్గురు పిల్లలను తీసుకొని గంగాభవానీ ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. ఆలస్యంగా విషయాన్ని గుర్తించిన కుళ్లాయప్ప డయల్ 100 కాల్ చేసి సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ సోమశేఖర్, ఏఎస్‌ఐ విజయ్‌కుమార్, కానిస్టేబుల్ గోపాల్... సెల్‌ఫోన్ లోకేషన్ ఆధారంగా వారున్న చోటికి వెళ్లి రాత్రికిరాత్రే పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. అనంతరం తహసీల్దార్ స్వర్ణలత సమక్షంలో భర్తకు అప్పగించారు. ఇందుకు గాను 'గుడ్ వర్క్ ఫర్ డన్' కింద ప్రశంసా పత్రం అందజేశారు.

ప్రయాణికుల భద్రతకు చర్యలు

- ఏపీ రైల్వేస్ ఐజీపీ కేవీ మోహన్‌కుమార్


మాట్లాడుతున్న మోహన్‌కుమార్ (చిత్రంలో) జీఆర్‌పీ ఎస్పీ రాహుల్‌మీనా, డీఎస్పీ హర్షిత

గుంతకల్లు: రైలు ప్రయాణికుల భద్రతతో పాటు నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీ రైల్వేస్ ఐజీపీ కేవీ మోహన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులతో స్థానిక డీఆర్‌ఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కో-ఆర్డినేషన్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జీఆర్‌పీ ఎస్పీ రాహుల్‌మీనా, డీఎస్పీ హర్షిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రానున్న వేసవిలో రైళ్లలో చోరీలు ఎక్కువగా జరిగే అవకాశముందని, గుంతకల్లు డివిజన్‌కు సమీపంలోని సరిహద్దున ఉన్న కర్ణాటక, తెలంగాణ, చెన్నై రాష్ట్రాల సిబ్బందితో కలసి నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మహారాష్ట్ర, జార్ఖండ్, బిహార్ తదతర ప్రాంతాల నుంచి కొన్ని గ్యాంగ్‌లు రైళ్లలో ప్రయాణిస్తూ చోరీలు చేసి వెంటనే పక్క రాష్ట్రాలకు ఉడాయిస్తుంటారన్నారు. దీంతో పక్క రాష్ట్రాల సిబ్బందిని కో-ఆర్డినేషన్ చేసుకోగలిగితే దొంగలను పట్టుకోవడం సులవుతుందన్నారు. పెరిగిన ఎక్స్‌ప్రెస్ రైళ్ల సంఖ్యకు అనుగుణంగా రైల్వే పోలీసులతో పాటు లోకల్ పోలీసుల సాయాన్ని కూడా తీసుకుంటామన్నారు. సమస్యాత్మక రైలు మార్గాలపై ప్రత్యేక నిఘా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీలో ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే ఔట్‌సోర్సింగ్ కింద తాత్కాలికంగా సిబ్బంది నియమించుకుంటామన్నారు. అంతకు ముందు ఆయన జీఆర్‌పీ ఎస్పీ కార్యాలయంలో నూతనంగా నిర్మించిన బెల్ ఆఫ్ ఆర్మ్స్, గార్డు రూమ్‌లను ప్రారంభించారు. ప్రాంగణంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో జీఆర్‌పీ డీఎస్పీ మురళీధర్ (నెల్లూరు), సీఐ అజయ్ కుమార్, డివిజన్ పరిధిలోని జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నమ్మి ఓటేస్తే.. రైతుల నోట మట్టి కొడతారా?

- జిల్లా రైతులను కాదని చిత్తూరు జిల్లాకు నీళ్లు తీసుకెళతామంటే ఒప్పుకోం
- పేరూరు డ్యాంకు నీళ్లు తీసుకు రావడంలో ఎమ్మెల్యే సునీత వైఫల్యం
- నేటి నుంచి గ్రామాల పర్యటన
- అఖిల పక్ష నేతలతో చర్చించి లైనింగ్ పనులు అడ్డుకుంటాం
- రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి


మాట్లాడుతున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడు రూరల్: నమ్మి ఓటేసిన పాపానికి జిల్లా రైతుల నోట కూటమి సర్కార్ మట్టి కొడుతోందని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హంద్రీ-నీవా కాలువ లైనింగ్ పనులు ఆపాలని పార్టీలకు అతీతంగా రైతులు స్పందిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా ఎక్కడికక్కడ జంగిల్ క్లియరెన్స్ పనులను అడ్డుకుంటున్నారన్నారు. కాలువకు కాంక్రీట్ లైనింగ్ వేస్తే దాదాపు 20 కిలోమీటర్ల దూరం వరకు భూగర్భ జలాలు అడుగంటి పంటల సాగుపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. బోర్లు ఎండిపోయి రైతులు వలస వెళ్లే పరిస్థితులు నెలకొంటాయన్నారు. ఈ విషయంగా గతంలో పలు విజ్ఞప్తులు చేసినా కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. రైతు సంక్షేమానికి పార్టీలకు అతీతంగా టీడీపీ, బీజేపీ, జనసేన, కమ్యూనిస్టు పార్టీల నేతలు, రైతు సంఘాలు, రైతు కూలీలు, నాయకులు అందరూ కలిసికట్టుగా పోరాడదామని పిలుపునిచ్చారు. ఇందు కోసం శనివారం నుంచి హంద్రీ-నీవా ప్రాజెక్ట్ పరిధిలోని గ్రామాల్లో పర్యటించి అఖిల పక్ష నేతలతో చర్చించి, ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తామన్నారు. లైనింగ్ పనులను అడ్డుకునేందుకు ఎవరు వచ్చినా కలుపుకొని పోరాటాలు చేస్తామన్నారు. శ్రీశైలం డ్యాంలో 80 టీఎంసీల వరకు నీళ్లు ఉన్నాయని, రోజూ సగటున ఇరు రాష్ట్రాలు అర టీఎంసీ మాత్రమే డ్రా చేస్తున్నాయన్నారు. ఈ లెక్కన మరో ఐదు నెలల వరకు వాడుకోవచ్చన్నారు. ఈ లోపు మడకశిర బ్రాంచ్ కెనాల్ కింద ఉన్న చెరువులు, పేరూరు డ్యాంకు కూడా నీరు ఇవ్వొచ్చన్నారు. జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు ఆ దిశగా ఎందుకు ఆలోచించడం లేదో అర్థం కావడం లేదన్నారు. పెన్నానదిలో ఇసుక తోడుకునే విషయంలో ఉన్న ఉత్సాహం పేరూరు డ్యాంకు నీళ్లు తీసుకు రావడంలో పరిటాల సునీత చూపించడం లేదన్నారు. తన నియోజవకర్గంలో చెరువులకు నీళ్లివ్వాలని అడగాల్సిన పెద్దమనిషి బాలకృష్ణ సైతం నియోజకవర్గ ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేసి తిరుగుతున్నారన్నారు. పెనుకొండ నియోజకవర్గంలో చెరువులకు నీళ్లు తెచ్చుకునే విషయంలో మంత్రి సవితమ్మ మాట్లాడాలన్నారు. కొత్తగా వచ్చిన ఎంఎస్ రాజు మడకశిర నియోజకవర్గంలోని అగళి, అమరాపురం డిస్ట్రిబ్యూటరీలు పూర్తి చేసేందుకు రూ. 200 కోట్ల నిధులను ప్రభుత్వం నుంచి రాబట్టుకునేందుకు ప్రయత్నించాలన్నారు. జిల్లా రైతులను కాదని చిత్తూరు జిల్లాకు నీళ్లు తీసుకుపోవాలని చూస్తే అడ్డుకుంటామన్నారు. హంద్రీ-నీవా ప్రాజెక్ట్‌ను అనంతపురం, కర్నూలు జిల్లాలకే పరిమితం చేయాలన్నారు. ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సైతం దీనిపై స్పందించాలన్నారు. మైక్రో ఇరిగేషన్ లేదా పిల్లకాలువల నిర్మాణాలు పూర్తయిన తర్వాత లైనింగ్ పనులు చేసుకోవాలన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రామగిరి మండల కన్వీనర్ మీనుగ నాగరాజు, నాయకులు ఆదిరెడ్డి, మదిగుబ్బ వీరాంజనేయులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా..



గాయపడిన చంద్రశేఖర్, వెంకటరమణప్ప

గుత్తి రూరల్: ప్రైవేట్ బస్సు బోల్తాపడిన ఘటనలో పలువురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. అనంతపురం నగరానికి చెందిన ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు పుణ్యక్షేత్రాల సందర్శనకు ఈ నెల 6న బయలదేరింది. కాశీ, ఉజ్జయిని, పండరీపురం, షిర్డీ, నాసిక్‌తో పాటు పలు క్షేత్రాలను సందర్శించిన భక్తులు ఈ నెల 15న కుంభమేళా నుంచి బయలుదేరారు. గురువారం మంత్రాలయానికి చేరుకుని రాత్రికి అక్కడే విడిది చేశారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు మొత్తం 48 మంది భక్తులతో బయలుదేరిన బస్సు... ఆదోని, పత్తికొండ మీదుగా గుత్తికి వస్తుండగా కర్నూలు జిల్లా జొన్నగిరి గ్రామ శివారులో ఎర్రమన్నుగుట్ట సమీపంలో ముందు టైర్ పేలడంతో ఒక్కసారిగా అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న పంట పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఘటనలో అనంతపురం విద్యుత్ నగర్‌కు చెందిన బస్సు డ్రైవర్ వినోద్‌కుమార్, వన్నూరుస్వామి, ప్రమీల, మహాలక్ష్మి, వన్నూరుస్వామి, ఉమాదేవి, అనంతపురం రూరల్ మండలం బ్రాహ్మణపల్లికి చెందిన తులసి, కర్ణాటకలోని బసవనహళ్లికి చెందిన లక్ష్మయ్య, బెంగళూరు రూరల్ తాలుకా గుండంగేరికి చెందిన నాగరాజాచారి, నాగలక్ష్మి, చంద్రశేఖర్, జయలక్ష్మి, ప్రేమమ్మ, చిక్‌బళ్లాపురం జిల్లా డి.మల్లికెర గ్రామానికి చెందిన వెంకటరమణప్ప, యలహంకకు చెందిన పూర్ణిమాబాయి, బలసముద్రం నివాసులు ఆదెమ్మ, హనుమంతప్ప, దొడ్డబళ్లాపురానికి చెందిన ఆదిశేషు, తుమకూరుకు చెందిన పుష్పవతి తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టి, క్షతగాత్రులను ఆగమేఘాలపై గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో పరిస్థితి విషమంగా ఉన్న తులసి, పూర్ణిమాబాయి, ఆదిశేషు, లక్ష్మయ్యను మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి రెఫర్ చేశారు.